






# రథం పండుగ రవీంద్రనాథ టాగోర్

*రథోత్సవ్(1921),లిపిక*



రథం పండుగ దగ్గర పడింది.

రాణి రాజుతో అంది, “పద! రథం పండుగ చూసి వద్దాం!”

“అలాగే! తప్పకుండా!” అన్నాడు రాజు.

వాళ్ళ గుఱ్ఱపుశాల నుంచి గుఱ్ఱాలు వచ్చాయి. ఏనుగుశాల నుంచి ఏనుగులు వచ్చాయి. నెమళ్ళు బారులు తీరాయి. వరసలు వరసలుగా కత్తులు పట్టుకొన్న సైనికులు బారులు తీర్చారు.

వారి వెనకగా, ఆడ మగా, దాసులు, దాసానుదాసులు పరసగట్టారు. ఉత్సాహంగా ఊరేగింపు ముందుకు సాగింది.

ఒక్కరు మాత్రం మిగిలి పోయారు. ఆమె పని అడవికి వెళ్ళి పుల్లలు సేకరించి, చీపుళ్ళు చేయడం.

జాలిగుండె గల ఊరిపెద్ద వెళ్ళి, ఎంతో దయగా ఆమెను ఆహ్వానించాడు, “నువ్వూ రా. పరసలో చేరు.”

ఆమె చేతులు ముడిచి, దండం పెడుతూ అంది, “నేను రాలేను.”

ఆ నోట ఈ నోటా తిరిగి ఈ మాట రాజుగారి చెవిన పడింది.

ఒక్క దుఃక్షిని తప్ప అందరూ రథోత్సవానికి వస్తున్నారని.

రాజు హృదయం ద్రవించింది. మంత్రిని ఆదేశించాడు, “ఆమెను ఇక్కడికి ప్రవేశపెట్టండి!”

ఆమె గుడిసె రాజ మందిరానికి పక్కనే ఉంది. రథం పండుగ ఊరేగింపు ఆమె గుడిసె ముందుగానే వెళుతుంది. తన ఏనుగు ఆమె గుడిసె దగ్గరికి రాగానే, మంత్రి అన్నాడు, “ఓ దుఃక్షినీ, వచ్చి దేవుడిని సేవించుకో!”

ఆమె ముకుళించిన హస్తాలతో బదులిచ్చింది.

“ఎంత దూరం నడవాలి? దేవుని సన్నిధికి చేరేంత శక్తి నాకున్నదా?”

మంత్రి భరోసాగా అన్నాడు, “అలాంటి భయాలేం పెట్టుకోకు. నువ్వు రాజు గారితో పాటు వెళుతున్నావు.”

ఆమె బదులిచ్చింది, “దేవుణ్ణి అలా ఉంచి, రాజు గారి మార్గం నా దారి కాదు.”

•



“నువ్వేం చేస్తావ్? రథం పండుగ కళ్ళారా చూడగలిగితే, అది నీ అదృష్టం కాదూ?”

“కానీ, నేను ఇక్కడే ఉండాలి. దేవుడు రథం ఎక్కి, నా గుడిసెకే వస్తాడు.”

మంత్రి నవ్వి అన్నాడు, “రథం నడిచిన ఆనవాళ్ళేవి? రథచక్రాల చాళ్ళేవి?”

ఆమె అంది, “అతని రథం సాగిన గుర్తులను వదలదు.”

మంత్రి అడిగాడు, “ఎందుకో? చెప్పు నాకు!”

ఆమె అంది, “ఎందుకంటే ఆయన పూలరథం ఎక్కి వస్తాడు.”

మంత్రి అడిగాడు, “ఏదీ ఆ రథం? ఎక్కడుంది? చూపించు!”

దుఃక్షిని తన గుడిసె గుమ్మానికి ఇరువైపులా

విరబూసిన పొద్దుతిరుగుడు పూలని చూపించింది.

*

Foot Notes: 1.దుఃక్షిని : దుఃఖించే స్త్రీ 2. పరస : దేవుని జాతరకు ఊరేగింపుగా వెళ్ళడం.

References: రవీంద్రనాథ టాగోర్, బెంగాలీ, రథోత్సవ్(1921),లిపిక

★★★

COMMENTS